క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కాజీపేట రూరల్: కాజీపేట తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ కేంద్రం ఏర్పాటు, కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ విస్తరణ, అభివృద్ధి, రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంల విస్తరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలు, రైల్వే అభివృద్ధి పనుల నిర్మాణం, రైల్వే కార్మిక సంక్షేమంపై చర్చించనున్నట్లు తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, గౌరవ అతిథులుగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పాల్గొంటారని రాఘవేందర్ వివరించారు.

సెంట్రల్ వర్సిటీలో ఇద్దరు విద్యార్థులకు సీటు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అఖిల, శ్రావణ్.. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ తెలుగులో సీటు సాధించారు. ఈమేరకు వారిద్దరిని కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, కేయూ పాలక మండలి సభ్యులు, తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు, తదితరులు శుక్రవారం అభినందించారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



కాజీపేట: ఫైర్ సేఫ్టీపై హనుమకొండ జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆవరణలో అగ్నిమాపక శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోడౌన్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగినప్పుడు అనుసరించాల్సిన పద్ధతులు, మంటలను ఆర్పే విధానాన్ని ఎఫ్‌సీఐ సిబ్బందికి వివరించారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్లు ప్రకాశ్‌వర్మ, సుమిత్ చక్రవర్తితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతుడు

కాశిబుగ్గ: రైలులో నుంచి జారి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వరంగల్ – కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య హంటర్‌రోడ్డు శాయంపేట రైల్వే గేటు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 30 – 35 ఏళ్ల మధ్య వయస్సు గల మృతుడి చాతి ఎడమ వైపు మామ్ అని, ఎడమ చేతిపై వైషు అని, కుడి చేతిపై గాంధీ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్లు ఉన్నాయని వివరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. వివరాలకు జీఆర్పీ స్టేషన్‌లో లేదా 94415 57232, 871265 8585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: కాపురం చేయొద్దంటూ ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వరంగల్ నర్సంపేట రోడ్డులోని లేబర్ కాలనీకి చెందిన కాసిం రమాదేవి ఇటీవల వరంగల్ ఉర్సు గుట్ట రోడ్డు వినాయక కాలనీకి చెందిన పిట్ట పవన్‌ను మూడో వివాహం చేసుకుంది. రమాదేవి మొదటి భర్తకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త మరణించడంతో ఆమె తన పిల్లలను అక్కడే వదిలేసి రెండు వివాహం చేసుకుని అతన్ని కూడా వదిలేసి పిట్ట పవన్‌ను మూడో పెళ్లి చేసుకుని ఫోర్ట్ రోడ్డు ఏకశిలనగర్‌లో అద్దె ఇంటిలో కాపురం పెట్టింది. ఈ విషయం తెలిసిన రమాదేవి మొదటి భర్త కుమారుడు వస్కుల వెంకటరాజు గురువారం రాత్రి తల్లి వద్దకు వచ్చాడు. తన తల్లితో కాపురం చేస్తే చంపేస్తానని బెదిరించి కత్తితో దాడి చేయగా.. పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు పవన్ ఫిర్యాదు మేరకు వెంకటరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసం

ఖిలా వరంగల్ : ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.24 లక్షలు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ తోట్లవాడకు చెందిన దామెరకొండ రంజిత్‌కుమార్ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి చెందిన యువకుడు గొట్టె విష్ణువర్ధన్‌ను నమ్మించి అతడి నుంచి రూ.24 లక్షలు తీసుకుని మొహం చాటేశాడు. ఏడాది దాటినా ఉద్యోగం ఇప్పించలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదు. మోసం చేసినట్లు గ్రహించిన బాధితుడు విష్ణువర్ధన్ శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిరుపయోగంగా ఎంఈఓ కార్యాలయం

● ఏడున్నరేళ్లుగా తెరుచుకోని భవనం



అలంకారప్రాయంగా మారిన ఎంఈఓ కార్యాలయం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రం నిరుపయోగంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేనితనం వల్ల భవనం ఉపయోగంలో లేక క్రమేణా శిథిలావస్థకు చేరుతోంది.

రూ.10 లక్షల వ్యయంతో భవన నిర్మాణం

పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పడిన జిల్లాలు, మండలాల్లో భాగంగా కాజీపేట మండలానికి ఏడున్నర ఏళ్ల క్రితం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం మంజూరైంది. మండల విద్యాశాఖ సిబ్బందికి అందుబాటులో ఉండాలనే ఆకాంక్షతో ప్రభుత్వం రూ.10 లక్షల నిధులను మంజూరు చేయగా అన్ని సౌకర్యాలతో భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఎంఈఓతో పాటు రిసోర్స్ పర్సన్స్, మండలంలోని ఉపాధ్యాయులు అవసరమైనప్పుడు సమావేశాలు జరుపుకునేలా భవనాన్ని నిర్మించారు. కాజీపేట మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లేని కారణంగా భవనం నిరుపయోగంగా మారింది. హనుమకొండ ఎంఈఓ కాజీపేట మండలానికి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పూర్తిస్థాయి ఎంఈఓ పోస్టు మంజూరు చేస్తే తప్ప ఈ భవనం ఉపయోగంలోకి వచ్చేలా కనిపించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఎంఈఓను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దు



వెంకటయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిలు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ నేరస్తులకు పోలీసులు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో కేసులు నీరుగారిపోతున్నాయని హనుమకొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దళితులు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వాటిని అరికట్టాల్సిన పోలీసులు, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, న్యాయవాది అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సై శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణుకుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, నేనావత్ రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేడ రంజిత్, బైరపాక ప్రశాంత్, కాడపాక రాజేందర్, పోలపల్లి రామ్మూర్తి, మాలకుమ్మరి పరశురాములు, సరిగొమ్ముల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు



నయీంనగర్: కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ వరంగల్ ఇన్‌చార్జ్ నమిండ్ల క్లైమెంట్, నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిశారు. ఈమేరకు చైర్మన్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ, ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కలకొట్ల జయరాం, చీకటి కుమార్, గుండా రమేష్, హరిచంద్రు నాయక్, బొల్లం సంజీవ, సదానందం ఉన్నారు.

17న బీరన్న బోనాలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

ఖిలా వరంగల్: ఈనెల 17న కరీమాబాద్ బీరన్న గుడిలో కురుమ కుల సంఘం ఆధ్వర్యంలో బీరన్న బోనాలను నిర్వహించనున్నట్లు కురుమ కుల సంఘం, బీరన్న స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొరె సదానందం తెలిపారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న గుడి ఆవరణలో గుడి కమిటీ ప్రధాన కార్యదర్శి కొరె నాగరాజు, కోశాధికారి నరిగె లక్ష్మణ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ఏకాదశి రోజున బీరన్న దేవుడికి కురుమ కులస్తులు నైవేద్యంగా బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. 17న మహిళలు ఉపవాస దీక్షతో బోనాన్ని సిద్ధం చేసి సాయంత్రం సామూహికంగా తరలిరావాలని కోరారు. గుడి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో దయ్యాల కృష్ణ, దయ్యాల సుధాకర్, మల్లేశం, కొరె కుమారస్వామి, బండారి రాజేశ్వర్, కొమురెల్లి, నవీన్, సదానందం, క్రాంతికుమార్, రాజు, తిరుపతి, శ్రీనివాస్, శంకర్, వేణు, శ్రీనివాస్, చిన్న రవి, అరవింద్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

‘జంగా’కు అభినందన



కాజీపేట: రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని కాజీపేట మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సందెల విజయ్ కుమార్, కె.నగేష్, మాతంగి నర్సింగ్, దోమ మహేందర్ రెడ్డి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రాధక్క సంతాప సభను జయప్రదం చేయండి



సంతాప సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని కాళోజి కూడలిలో రాధక్క సంతాప సభ వాల్‌పోస్టర్లను న్యూ డెమోక్రసీ నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖిలా వరంగల్ పెట్రోల్‌పంపు రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 14న ఉదయం రాధక్క సంతాప సభ నిర్వహించనున్నట్లు వివరించారు. న్యూ డెమోక్రసీ పార్టీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, న్యూడెమోక్రసీ ఖమ్మం వరంగల్ ఏరియా కమిటీ నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పాల్గొనున్న సభకు ప్రజాస్వామిక వాదులు, యువకులు, కార్మికులు, కర్షకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సారయ్యకు సన్మానం



కాశిబుగ్గ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో కాశిబుగ్గకు చెందిన పలు ఆలయాల కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సారయ్యను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయం, భక్త మార్కండేయ దేవాలయ అర్చకులు, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాళోజీ సెంటర్: నీట్ పరీక్షను రద్దు చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్, పెట్టుబడిదారులకు కేంద్రం అప్పగించిందని విమర్శించారు. దాంతో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయాదాయంలో విద్యారంగానికి 6శాతం నిధులు కేటాయించాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో జీఓ నంబర్ 3ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, రంజిత్, కరుణాకర్, హరిబాబు, వీరన్న, బాలరాజు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు



గద్దె వద్ద గుమిగూడిన స్థానికులు

ఖిలా వరంగల్: ఇరువర్గాలు మత విద్వేషాలను రెచ్చగొట్టదని, సమస్యను సామరస్య పూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. జెండా గద్దె స్థలం ఎవరిదనే అంశంపై సమగ్రంగా విచారణ జరిపి రికార్డు ప్రకారం సంబంధిత బాధ్యులకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఖిలా వరంగల్ మధ్యకోటలోని జెండా గద్దె వద్దకు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ వాదులు, హిందూ, ముస్లింలు శుక్రవారం చేరుకున్నారు. ఆ స్థలం మాది అంటే.. మాది అనే స్థాయికి ఇరువర్గాలు రెచ్చిపోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటుకుంది. ఘటనా స్థలానికి తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుతోపాటు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య చేరుకున్నారు. గుమిగూడిన జనాన్ని పోలీసులు పంపించివేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని హెచ్చరించారు. అనంతరం జెండా గద్దె షెడ్డుకు తాళాలు వేశారు. జెండా గద్దె స్థలం ఎవరన్నది తాము తెలుస్తామని, అప్పటి వరకు సంయమనం పాటించాలని వారికి సూచించారు.

ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు మెండు



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారి

ఖిలా వరంగల్: ఎన్‌సీసీ శిక్షణలో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడడంతో పాటు భవిష్యత్‌లో అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏవీవీఎస్ పాఠశాలల చైర్మన్ డాక్టర్ అంకతి వీరస్వామి తెలిపారు. వరంగల్ 17వ డివిజన్ స్తంభంపెల్లిలో రోడ్డులోని ఏవీఎస్ హైస్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ అంకతి సాగర్, ఎన్‌సీసీ పదవ బెటాలియన్ అధికారి మక్బుల్‌పాషా, దీపక్‌వాగ్ నేతృత్వంలో ఎన్‌సీసీ శిక్షణ కోసం విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణతో పాటు దేశభక్తి, శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సిమరజిత్ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత పనులకు ప్రభుత్వ వాహనాలు

● నిఘా పెట్టాలని కోరుతున్న ప్రజలు

ఖిలా వరంగల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు శాఖలకు ద్విచక్ర వాహనాలను కేటాయించింది. ఆ వాహనాలను ప్రభుత్వపరమైన అవసరాలు, విధి నిర్వహణకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అయితే కొంతమంది ఉద్యోగులు తమ సొంత అవసరాలకు బైక్‌లను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం గవిచర్ల క్రాస్ రోడ్డులోని ఓ వైన్‌షాపు వద్దకు ప్రభుత్వ బైక్‌పై ఓ ఉద్యోగి వెళ్లడాన్ని గమనించిన కొంతమంది.. సోషల్ మీడియా ఆ దృశ్యాన్ని అప్‌లోడ్ చేశారు. దాంతో అది వైరల్‌గా మారింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రత్యేక నిఘాపెట్టి కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ హితానికి పేపర్ బ్యాగులు



దేశాయిపేట: అవగాహన కల్పిస్తున్న కేడెట్లు

దేశాయిపేట: పర్యావరణ హితానికి ప్రజలు పేపర్ బ్యాగులను వాడాలని ఎన్‌సీసీ కేడెట్లు సూచించారు. శుక్రవారం పేపర్ బ్యాగ్ డే సందర్భంగా సీకేఎం ప్రభుత్వ కళాశాలలో పేపర్ బ్యాగుల వాడకంపై కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి తెలిపారు. డాక్టర్ వరప్రసాద్, అనిల్, శ్రీనివాస్, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్ కుమార్, స్రవంతి, హరిబాబు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

హసన్‌పర్తి: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని గ్రీన్‌వుడ్ పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్‌తో తయారు చేసిన ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్ రాధాకృష్ణన్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సింథిల్ రామ్‌మధురై, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్‌కుమార్, పవన్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో పేపర్ బ్యాగుల పంపిణీ

కాజీపేట రూరల్: పేపర్ బ్యాగ్ డే సందర్భంగా కాజీపేట జంక్షన్ ప్రాంతంలో చిరు వ్యాపారులకు వినూత్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పేపర్ బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే, అన్నదానం చేశారు. కార్యక్రమంలో జయశ్రీ, ఆర్.రాజిరెడ్డి, డేవిడ్, రాజ్‌కుమార్, దయాన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: జీవకోటి, మానవ మనుగడకు చెట్లే ఆధారమని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఇందిరా ప్రభ కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పరిరక్షణపై కళాజాతా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నియంత్రణ వన సంపదతోనే సాధ్యమని అన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే మొక్కలు, చెట్లను కాపాడుకోవాలని బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. మొక్కల పెంపకంపై ప్రజలకు కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూపాక శివ, ఆనందం, అరవింద్‌కుమార్, రామకృష్ణ, రామనాథం, రాజు, ఇల్లందుల సతీష్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు కీలకం



మాట్లాడుతున్న ఆడెపు రమేష్

కేయూ క్యాంపస్: సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంత కీలకమని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి, సూర్యాపేట రాయినిగూడెంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఆడెపు రమేష్ అన్నారు. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీస్ – ఏ టూల్ ఫర్ బెటర్ పేషంట్ కేర్ అనే అంశంపై ఆయన విస్తృతోపన్యాసం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నిర్వచనం ప్రకారం ఒక వ్యక్తి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆ వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు అని గుర్తుచేశారు. ప్రస్తుతం సమాజంలో చిన్న ఆరోగ్య సమస్య ఎదురైనా ఔషధాలు వినియోగించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో క్లినికల్ ఫార్మసిస్టులు ప్రిస్క్రిప్షన్లలోని పొరపాట్లను సరిదిద్దుతూ అటు డాక్టర్లకు ఇటు రోగులకు వారధిగా నిలుస్తున్నారని వివరించారు.

సంక్షిప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖిలా వరంగల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, మలేరియా విభాగం అధికారి మాధవరెడ్డి సూచించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌లో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్లను వేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బోగి సురేష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, హెల్ అసిస్టెట్ శివకుమార్, నవీన్, శివ, జనార్దన్, కిరణ్, జవాన్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ కమిటీ

కాజీపేట: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ కాజీపేట మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రెంటాల కోటి, ఎర్ర నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మైదం కుమార్, కోశాధికారిగా సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా అరికెల వెంకటస్వామి, గౌరవ సలహాదారుడిగా కారు ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా అరూరి రవీందర్, సతీష్, రేణుక, సహాయ కార్యదర్శులుగా మౌనిక, సువర్ణతో పాటు 28 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తామని వారు తెలిపారు.

ఆలయానికి నిధులు మంజూరు చేయండి

ఖిలా వరంగల్: ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయాలని శ్రీశివశక్తి వినాయక ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, అచ్చ వినోద్‌కుమార్, చెన్నూరి దేవేందర్, సిద్దం రాము, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, రాజన్‌బాబు, కుడికందుల క్రాంతి, ముటికె నరేష్ పాల్గొన్నారు.

సింహగర్జన సభకు తరలిన రైల్వే నాయకులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్‌లోని రైల్వే మజ్దూర్ యూనియన్ సింహగర్జన సభకు కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచీల నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. కాజీపేట జంక్షన్ నుంచి రైలులో సికింద్రాబాద్‌కు వెళ్లి రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొన్నట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌షెడ్ బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాష్, చైర్మన్ జానీమియా తెలిపారు.

గుట్కాల పట్టివేత

ఖిలా వరంగల్: పాన్‌షాపులో రూ.1409ల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీన చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. వరంగల్ – నర్సంపేట రోడ్డు దయానంద కాలనీకి చెందిన ఎండీ.ఖాజా కరీమొద్దీన్ పాన్ షాపుపై శుక్రవారం సాయంత్రం ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై సుదర్శన్ దాడి చేసి గుట్కాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.